## తిప్రాస్‌పల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన

● పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



పూజోల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్, ఏప్రిల్ 7: మండలంలోని తిప్రాస్‌పల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 6గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బొడ్రాయిని ప్రతిష్ఠించారు. మహిళలు మంగళహారతులతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక దళిత కాలనీ, బీసీవాడలో ప్రతిష్ఠించిన బొడ్రాయి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వేర్వేరుగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ సుమంగళ, మాజీ జెడ్పీటీసీ అశోక్‌కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు.

## మినీ ట్యాంక్‌బండ్ పనులను పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 7: పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మినీ ట్యాంక్ బండ్ వద్ద రూ.50లక్షల మూడా నిధులతో హైమాస్ట్ విద్యుద్దీపాల పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ రూ.2కోట్ల మూడా నిధులతో మినీ ట్యాంక్ బండ్‌ను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. మరో కోటి యాభై లక్షలతో సైకిల్ ట్రాక్, నడక దారి, గ్రీనరి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ప్రాంతం పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, పాల్గొన్నారు.

### ప్రతిగింజనూ కొంటాం

పాలమూర్, ఏప్రిల్ 7: రైతులు పండించిన ప్రతిగింజనూ కొంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మన్యంకొండ గేట్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మక్తల్‌లో అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి


ఊట్కూర్, ఏప్రిల్ 7: పేదల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని అమీన్‌పూర్, పగిడిమర్రిలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం అమీన్‌పూర్‌లో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో తాసీల్దార్ రవి, నారాయణరెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, విగ్నేశ్వర్‌రెడ్డి, బసవరాజ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడి పాల్గొన్నారు.

### అంబలి కేంద్రం ప్రారంభం

మక్తల్, ఏప్రిల్ 7: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రం ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ పట్టణానికి చెందిన కొత్త సోమయ్య, రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుమారులు కొత్త శ్రీనివాస్‌గుప్తా, కొత్త జగదీశ్‌గుప్తా, కొత్త సూర్యనారాయణ గుప్తా, కొత్త నర్సింహులు గుప్తా, డాక్టర్ కిరణ్ సహకారంతో పడమటి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. అలాగే మక్తల్‌లో అతి పురాతనమైన వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా నూతన విగ్రహాల కొనుగోలుకు పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ కొత్త సూర్యనారాయణ గుప్తా రూ.5లక్షల చెక్కును ఆలయ కమిటీ సభ్యుడు వెంకటేశ్‌కు అందజేశారు.

### పుసల్‌పహాడ్‌లో..

మరికల్ మండలంలోని కన్మనూర్‌లో సన్నబియ్యం పంపిణీని ఎమ్మెల్యే శ్రీహరి ప్రారంభించారు.. ప్రతి ఒక్కరూ సన్న బియ్యంతో కడుపునిండా తినాలన్నదే లక్ష్యమన్నారు. అలాగే మండలంలోని రాకొండ, పుసల్‌పహాడ్ గ్రామాల్లో తాసీల్దార్ అనిల్ కుమార్ సన్నబియ్యం పంపిణీ చేశారు. అనంతరం పుసల్‌పాడ్‌లో వడ్లచారి ఇంట్లో సన్నబియ్యంతో వండిన భోజనాన్ని అరగించారు.



పూసల్‌పాడ్‌లో సన్నబియ్యం భోజనం చేస్తున్న తాసీల్దార్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**SPOKEN ENGLISH**

★ **Spoken English** for VIPS at Home (Political Leaders / Officers / Business persons) కేవలం 15 రోజుల్లోనే (రోజు 2 గంటలు) మీ ఇంటికే వచ్చిఈజీగా ఇంగ్లీష్‌లో ఎలా మాట్లాడాలో నేర్పించబడును. Training by A.Venkat Reddy, AVR Institute of Spoken English. **Cell No.8187041458.**
**NT-MBNR**

**అర్జెంటుగా కావలెను**

★ అర్జెంటుగా సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. వసతి సౌకర్యం కలదు. మంచి జీతం కలదు. సంప్రదించండి: 9392663777, 9246663777.
**NT-329238**

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● పాలమూరు కలెక్టర్ విజయేందిర బోయి
● ప్రజావాణికి 92 ఫిర్యాదులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతమిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 92 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ మోహన్‌రావుకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కారించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ గృహాల గ్రౌండింగ్ వేగవంతం చేయాలని ఆదేశించారు. తాగునీరు సమస్యపై సమీక్షించాలని, ఎక్కడైనా సమస్య, నిధులు అవసరముంటే ప్రతిపాదనలు అందజేయాలన్నారు. పంటల పరిస్థితి, విద్యుత్ సరఫరాపై కూడా దృష్టిపెట్టాలని సూచించారు. రేషన్‌షాప్‌లను పర్యవేక్షించాలని, లబ్ధిదారులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. ఈనెల 16న మహబూబ్‌నగర్ ఎంపీ అధ్యక్షతన దిశ సమావేశం నిర్వహించనున్నందున కేంద్రం పథకాల అమలుపై ఆయా శాఖలు ప్రగతిపై నోట్స్ అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్ రావు, జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

### పేట ప్రజావాణికి 25 ఫిర్యాదులు

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 25 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు విన్నవిస్తూ దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బేన్‌షాలం పాల్గొన్నారు.

### బాధితులకు న్యాయం చేయాలి

నారాయణపేట, ఏప్రిల్ 7: గ్రీవెన్స్ డేలో బాధితులు అందించిన ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించి పరిష్కరించాలని డీఎస్పీ లింగయ్య పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో నలుగురు బాధితులు తమ ఫిర్యాదులు అందజేశారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న డీఎస్పీ ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని వారికి న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు, పై ఆఫీసులకు వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులను తీసుకురావద్దని ఫిర్యాదుదారులకు సూచించారు.

## హత్య కేసులో నేరస్తుడికి జైలు శిక్ష

మద్దూర్ (కొతపల్లి) ఏప్రిల్ 7: హత్యకేసులో నిందితుడికి యావజ్జీవజైలు శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి అబ్దుల్ రఫీ తీర్పు చెప్పినట్లు ఎస్పీ యోగేశ్ గౌతం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా.. మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన కృష్ణవేణిపై వింజమురుకు చెందిన జోగు వెంకట్‌రాములు అత్యాచారం చేయడానికి ప్రయత్నించగా ఆమె నిరాకరించడంతో ఆమెపై పెట్రోల్‌పోసి నిప్పుపెట్టడంతో చికిత్స పొందుతూ కృష్ణవేణి 19 ఫిబ్రవరి 22న మృతి చెందిందని, మృతురాలి తల్లి ఫిర్యాదుతో స్థానిక పోలీసులు కేసునమోదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపిన పోలీసులు కోర్టులో నిందితుడిని ప్రవేశపెట్టగా సోమవారం జిల్లా జడ్జి మహ్మద్ రఫి నేరస్తుడికి యావజ్జీవ శిక్షతోపాటు రూ.5వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు.

## తాగునీటి సమస్య రానీయొద్దు

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 7: వేసవికాలం దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కొరతపై సోమవారం జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డితోపాటు మిషన్ భగీరథ అధికారులతో కలసి మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డులవారీగా తాగునీటి సరఫరా గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మంగళవారం నుంచి అన్నివార్డుల్లో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సూచించారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ ఏఈ వినోద్, మున్సిపల్ ఏఈ గాయత్రి, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల ఆందోళన

మూసాపేట, ఏప్రిల్ 7: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు సోమవారం మూసాపేటలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం ప్రజలకు ఇసుకను తక్కువ ధరకే అందించాలని అమలు చేస్తున్న మన ఇసుక పాలసీ పథకంలో భాగంగా తమ ట్రాక్టర్లతో ఇసుక సరఫరాకు అనుమతులిచ్చి తమను ఆదుకోవాలని వారంతా మూసాపేట తాసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పనులు లేక ఇసుక ట్రాక్టర్ల కిస్తులు చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సంస్థలు ట్రాక్టర్లను తీసుకెళ్తున్నాయని, తమకు తీరని అన్యాయం జరుతుందని, తమకు వెంటనే ఇసుక అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. అనంతరం తాసీల్దార్ రాజును కలిసి వినతి పత్రం అందజేశారు.

## సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర అర్బన్, ఏప్రిల్ 7: మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందినప్పటికీ వార్డులో సమస్యలు అలాగే మిగిలిపోయాయని.. వాటిని వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సమస్యలపై తాసీల్దార్ అర్బన్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పట్టణంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, తిరుమలయ్య, రామకృష్ణ, కురుమయ్య, జయమ్మ, రాజు పాల్గొన్నారు.

## సామాజికాంశాలపై అవగాహన ఉండాలి

భూత్పూర్, ఏప్రిల్ 7: విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి కోరారు. సోమవారం పట్టణంలోని గోప్లాపూర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు గ్రామీణ వాతావరణం అలవాటు కావాలని, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో పరిసరాల్లో పరిశుభ్రత లోపించడం, తాగునీటి ఎద్దడి, బాల్య వివాహాలు, మద్యపానంతో ఎదుర్కొనే ఇబ్బందులు విద్యార్థులకు అర్థం కావాలనే ఈ శిబిరాలను వేసవిలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిబిరం ముగిసిన అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. ప్రోగ్రాం ఆఫీసర్లకు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, ప్రోగ్రాం ఆఫీసర్లు రవీందర్‌రావు, సురేశ్, సత్యనారాయణ, సత్యభాస్కర్, వార్డు ఆఫీసర్ వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు సత్యనారాయణ, శ్రీనివాసులు, కొండస్వామి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 7: కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు సంబంధించి జిల్లాలోని ఉత్సాహవంతులైన వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మే 1నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే శిక్షణ నిర్వాహకులు సంబంధిత ధృవపత్రాలతో ఈనెల 22వ తేదీలోగా స్టేడియం మైదానంలోని డీవైఎస్‌వో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు అథ్లెటిక్ కోచ్ సునీల్‌కుమార్ నెంబర్ 9440656162 సంప్రదించాలన్నారు.

## నిరుపేదల ఆత్మగౌరవ పథకమే సన్నబియ్యం

● కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్, ఏప్రిల్ 7: రాష్ట్రంలో నిరుపేదల ఆత్మగౌరవ పథకమే సన్న బియ్యం పథకమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. నర్వ మండలం లంకలలో సోమవారం నిర్వహించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేషన్‌కార్డుదారులందరూ సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సన్నబియ్యాన్ని అమ్ముకోకుండగా వాడుకోవాలని సూచించారు. అంతకుముందు సన్నబియ్యం లబ్ధిదారు లైనటువంటి రేణుక ఇంట్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సన్నబియ్యంతో వండిన భోజనం ఆరగించారు. కార్యక్రమంలో తాసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, నర్వ మండల ప్రత్యేక అధికారి హర్యానాయక్ పాల్గొన్నారు.



లంకాలలో సన్నబియ్యం భోజనం చేస్తున్న కలెక్టర్

## పీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రమేశ్‌బాబు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 7: పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రమేశ్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన చెన్నప్ప హైదరాబాదుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఓయూ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్‌ను పీయూకు కేటాయించారు. ఈ సందర్భంగా పీయూ పరిపాలన భవనంలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో రమేశ్ బాబుకు వైస్‌చాన్స్‌లర్ జీఎన్.శ్రీనివాస్ శాలువాలతో సత్కరించి పూలబొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ చంద్రకిరణ్, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రవికాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌కు పూలబొకే అందజేస్తున్న వీసీ శ్రీనివాస్

### రిజిస్ట్రార్‌కు సన్మానం

పీయూ రిజిస్ట్రార్‌గా కొత్తగా బాధ్యతలు రమేశ్‌బాబును సోమవారం పాలమూరు విశ్వవిద్యాలయం బోధనేతర ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ రవీందర్, సంఘం అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్‌జీ, బుర్రన్న, మనోహర్, జాహ్నవి, మహేందర్, పర్వతాలు, రాగిణి, రాజేందర్, మానస, రాము, శ్రీనివాసులు, నర్సింహాగౌడ్, శ్రీను, చంద్రశేఖర్, మధుళిక, అభి, శ్రీనాథ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్లు పౌష్టికాహారం తీసుకోవాలి

● జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పాపిరెడ్డి

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 7: సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంగా ఉండేందుకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పాపిరెడ్డి సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్లలోని వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ల వైద్యశిబిరాన్ని ప్రిన్సిపల్ జడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైద్యశిబిరంలో హాజరైన సినియర్ సిటిజన్ల ఆరోగ్యస్థితిగతులను గురించి అడిగి తెలుసుకుని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులతో వృద్ధులకు కంటి, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సెషన్స్ కోర్టు జడ్జి కల్యాణ్‌చక్రవర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఇందిర, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, డాక్టర్లు శ్వేత, సౌమ్య, సీనియర్ సిటిజన్ల ఫోరం అధ్యక్షుడు నయిమొద్దీన్, శంకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న జడ్జి పాపిరెడ్డి

## టాస్ కోఆర్డినేటర్‌గా అవకాశం కల్పించాలి


మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 7: మహబూబ్‌నగర్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌కు అవకాశం కల్పించాలని గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పదో తరగతి మూల్యాంకన కేంద్రం మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఎదుట ఆందోళన, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జీటీఏ జిల్లా అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్‌గా అక్రమంగా నియమించబడ్డ వ్యక్తిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. జీవో1214కు జిల్లా పరిషత్ ఎస్ఏ నియామకం వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శంభుకిశోర్, ఆర్థిక కార్యదర్శి బుట్టశ్రీనివాసులు, కార్యదర్శులు నాగరాజు, గౌరవాధ్యక్షుడు అంతిరామ్‌నాయక్, సభ్యులు, మహిళా ఉపాధ్యాయులు పుష్పలత, సరోజ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జీటీఏ నాయకులు

## ప్రతి గ్రామంలో వైద్య సేవలు అందించాలి

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 7: వైద్యులు ప్రతి గ్రామంలో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం అప్పక్‌పల్లి వద్ద ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ రాంకిషన్ అధ్యక్షతన ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్, కాలోజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. వీసీ నందకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల పురోగతిలో ఉందని, కళాశాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, పర్యావరణ వేత్త పురుషోత్తం రెడ్డి, పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి ప్రసాద్‌రావు, సీనియర్ జర్నలిస్ట్ పతంగి రాంబాబు, డీసీసీ మాజీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, వైద్యులు జయచంద్రమోహన్ పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

### ప్రజారోగ్యంపై అవగాహన కల్పించాలి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7: ప్రజారోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏదిర పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతిసంవత్సరం ఒక్క కొత్త థీమ్‌తో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రజల్లో అవగాహన తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పీవో డబ్ల్యూ డాక్టర్ భాస్కర్‌నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ ప్రవీణ్, హెల్త్ ఎడ్యూకేటర్ రాజాగోపాల్ చారి, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మెడికల్ కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ విధానాలను వెనక్కి తీసుకోవాలి

నారాయణపేట, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయలక్ష్మి, భూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఓ ఫంక్షన్ హాల్లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ దేశంలోని ఉద్యోగ కార్మికులను కట్టు బానిసత్వంలోకి నెట్టేందుకు కేంద్రం తీసుకొస్తున్న నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం మే 20న జాతీయ కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం, ఉపాధ్యక్షుడు జోషి, హెల్పర్స్ అసోషియేషన్ జల్లా అధ్యక్షురాలు శశికళ, బాలమణి, జయంతి పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

నవాబ్‌పేట, ఏప్రిల్ 7: మండలంలోని యన్మన్‌గండ్ల గేట్ వద్ద జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం తాసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించిన పంచాయతీ కార్యదర్శి సుష్మభారతిని, పంచాయతీ సిబ్బందిని తాసీల్దార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హమీద్, చెన్నయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

## ‘పది’ మూల్యాంకనం ప్రారంభం

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 7 : మహబూబ్‌నగర్, జోగుళాంబ-గద్వాల, నారాయణపేట జిల్లాలకు సంబంధించిన పదో తరగతి మూల్యాంకనం జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో సోమవారం ప్రారంభించారు. మూడు జిల్లాలకు సంబంధించి మొత్తం సమాధాన పత్రాలు 2.26 లక్షలు మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకుగాను అసిస్టెంట్ ఎగ్జామినర్స్ 1094, స్పెషల్ అసిస్టెంట్స్ 361, అసిస్టెంట్ క్యాంప్ అధికారులు 7, క్యాంప్ అధికారులు 4, సపోర్టింగ్ స్టాఫ్ 15, క్లాస్ ఫోర్త్ 26మందికి విధులు కేటాయించినట్లు డీఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

### స్పాట్ రెమ్యూనరేషన్ పెంచాలి

పదో తరగతి జవాబు పత్రాలను మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు గతేడాది పెండింగ్‌లో ఉన్న 2023-24 స్పాట్ రెమ్యూనరేషన్ రూ.68లక్షలు పీఆర్టీయూ ప్రాతినిధ్యం వహించడంతోనే ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌యాదవ్ తెలిపారు. సోమవారం గ్రామర్ స్కూల్ స్పాట్ కేంద్రం వద్ద మాట్లాడారు. స్పాట్ రెమ్యూనరేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.

## జాతీయస్థాయి క్రీడాకారుడికి సన్మానం

మరికల్, ఏప్రిల్ 7: గత నెలలో బీహర్‌లో కొనసాగిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో మండలానికి చెందిన వేణు ప్రతిభ కనబర్చారు. సోమవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడాకారుడు వేణును జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి డోకుర్ తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ గోవర్ధన్ ఘనంగా సన్మానించారు. వారు మట్లాడుతూ.. జాతీయ స్థాయిలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఉడిపి సురేశ్, రాజశేఖర్, మహేదంర్‌రెడ్డి, ప్రకాశ్, మహేశ్, అశోక్, సత్యరెడ్డి పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బాస్కెట్‌బాల్‌కు ఎంపిక



ద్రోణదత్త

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 7: పాండిచ్చేరిలో ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న 40వ జాతీయ స్థాయి యూత్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు ద్రోణదత్త ఎంపికయ్యాడు. తెలంగాణ బాస్కెట్ బాల్ బాలుర జట్టులో స్థానం సంపాదించాడు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్షుడు అహ్మద్ జాకీర్, నసురుల్లా హైదర్, షరీఫ్, శుభాన్ అభినందించారు.

## స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 7: పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రతినెలా రూ.5వేలు జీతాలు చెల్లించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జడ్చర్లలోని మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీభాయి పూలే ఫౌండేషన్ చైర్మన్ గోపి పాల్గొని మాట్లాడారు. ఈనెల 11వ తేదీన మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో జయంతి వేడుకలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఫకీర్ హక్కుల సంఘం నాయకుడు జాహంగీర్‌పాషా మాట్లాడుతూ.. స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో పరమేశ్వరి, నవితరాణి, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, యాదయ్య, చిట్టెమ్మ పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 7: కష్టపడి చదివితే ప్రతిఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎన్‌ఆర్‌ఐ హనుమంత్ రెడ్డి సూచించారు. అడ్డాకుల మండలంలోని పెద్దమునగల్‌చేడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు ఎన్‌ఆర్‌ఐ హన్మంతురెడ్డి, భవానీ దంపతులు కంప్యూటర్లను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గురుకులాలకు ఎంపిక

దామరగిద్ద, ఏప్రిల్ 7: మండలంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అంబ్రేశ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు మొత్తం ఏడుగురు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శంభులింగం, హెచ్‌ఎం అలువేలుమంగ అభినందించారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

మాగనూరు, ఏప్రిల్ 7: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం కింద మోడల్ కామన్ సర్వీస్ సెంటర్ కేంద్రాల స్థాపనకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా మేనేజర్ దిలీప్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మోడల్ సీఎస్‌సీ, ఐసీటీ కేంద్రాలను స్థాపించాలనుకునే యువత, మహిళలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కామన్ సర్వీస్ సెంటర్లకు దరఖాస్తు చేసేటప్పుడు సెక్టార్: ఐఎస్‌బీలో డీటీపీ/కంప్యూటర్ సెంటర్/జిరాక్స్ సెంటర్ ఎంచుకొని, రూ.3-4 లక్షల యూనిట్‌ని ఎంచుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు పూర్తయ్యాక కావాల్సిన ధ్రువీకరణలు జతచేసి సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయంలో అందజేసి రసీదు పొందాలని పేర్కొన్నారు.

## దేవరకద్రలో ప్రైవేట్ దవాఖానలు సీజ్

దేవరకద్ర, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని నిబంధనలు పాటించని మూడు ప్రైవేట్ దవాఖానలను సీజ్ చేశారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో అనుమతులు లేకుండా, నిబంధనలను పాటించని సత్యసాయి దవాఖాన, అమ్మా క్లినిక్, మాదవి క్లినిక్‌లను రాష్ట్ర మేడికల్ కౌన్సిల్ శ్రీనివాసులు, జిల్లా మాస్ మీడియాధికారి మంజుల సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎంకు ఉత్తరాలు



సీఎంకు రాసిన ఉత్తరాలను చూపుతున్న వైద్య సిబ్బంది

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఎయిడ్స్ నియంత్రణ వైద్య సిబ్బంది ఉత్తరాలు రాసి స్పీడ్ పోస్ట్ చేశారు. అంతకు ముందు మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు ఎదుట తెలంగాణ సాక్స్, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఏఆర్‌టీ సెంటర్‌లో పనిచేస్తున్న డాక్టర్లు, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, కౌన్సిలర్, డాటా మేనేజర్లు, ఫార్మసిస్టు, సిబ్బంది పోస్టుకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. సాక్స్ సంఘం నాయకులు మధుసూదన్‌గౌడ్, కోటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సాక్స్ పరిధిలో రాష్ట్రంలో 800 మంది ఉద్యోగులు ఎయిడ్స్ నియంత్రణ కోసం ప్రాణాలు తెగించి పనిచేస్తున్నారన్నారు. పీడీ మాకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. మా అగ్రిమెంట్‌ను రెన్యూవల్ చేయకుండా రోజు వేతనం కట్ చేయడంతోపాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీంతో మా సర్వీసు కోల్పోయే ప్రమాదం ఉందని, సీఎం కల్పించుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.